# మనసు కళ్లు

రాజారావుకు ఐదునెల్లక్రితం ఓ బేంక్‌లో ఉద్యోగం వచ్చింది. అతను ఎన్నో కలలు కని, బాగా కృషి చేసి ఆ బేంక్ ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడు.

అతను ఉద్యోగంలో జాయినయి చాలా సంతోషించి ఇలా అనుకున్నాడు. తనకు వున్న రెండు ఆశయాల్లో ఒకదాన్ని సాధించాడు. ఇక రెండో ఆశయాన్ని కూడా సాధించాలి.

అతని రెండో ఆశయం యేమిటంటే? ఉద్యోగం చేసే ఒక అందమైన అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకోవడం. రాజారావుకు కట్నంమీద ఆశ కాదు. అతని ఇంట్లో ఎవరికీ అలాంటి ఆలోచనలేదు.

తను ప్రేమించే అమ్మాయి కూడా ఉద్యోగిని ఐతే ఆర్థిక ఇబ్బందులు అంతగా వుండవని అతని ఆలోచన, అందుకని రాజారావు ఉద్యోగం చేసే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు.

అతను ఉద్యోగంలో చేరిన మూడు నెలల తర్వాత ఆ బేంక్‌లోకి సరళ కొత్తగా వచ్చి ఉద్యోగంలో జాయినయ్యింది.

సరళ సన్నగా, నాజూగ్గా మెరుపుతీగలా ఉన్నది. బంగారు రంగులో ఉంది. పెద్దవిగా ఉన్న విశాలమయిన కళ్లు, సున్నాలా ఉన్న చిన్ననోరు, పలుచని పెదవులు అతడికి ఎంతగానో నచ్చాయి. ఆమెలో అందంకంటే ఆకర్షణ ఎక్కువగా కనిపించింది.

ఒక వారం రోజుల్లో రాజారావు-సరళతో పరిచయాన్ని బాగానే పెంచుకున్నాడు. మరికొన్ని రోజులు చాలా ఈజీగా గడిచిపోయాయి. వాళ్లిద్దరూ ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకోవడం అనవసరంగా తొట్రుపడడం, సిగ్గుపడడం జరిగిపోయి చివరకు ఒకర్నొకరు ప్రేమించుకునే దశకు చేరుకున్నారు.

ఒక సెలవురోజు సాయంత్రం రాజారావు ఎగ్జిబిషన్‌కు వెళ్లాడు. అక్కడ అతనికి ఒక స్టాల్ దగ్గర నిల్చుని ఏదో కొంటున్న సరళ కనిపించింది ఒంటరిగా. అతను గబగబా ఆమె దగ్గరకు వెళ్లి పలకరించి కొంచెం స్టయిల్‌గా నవ్వాడు.

ఆమె ఆశ్చర్యంగా 'మీరా!' అన్నది.

"అవును. ఒక్కరే వచ్చారేం?" అనడిగాడు.

"మా అమ్మను రమ్మని అడిగాను. రాలేదు"

తర్వాత ఇద్దరూ కొంచెంసేపు నడిచి చివరకు ఖాళీగా వున్న ఒకచోట కర్చీఫ్‌లు పరుచుకుని కూర్చున్నారు.

అప్పుడు అతను ఆమెతో "మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి" అన్నాడు చిన్నగా గొణుగుతున్నట్టు.

"మాట్లాడండి. ఎవరూ లేరుకదా" అన్నది ఉత్సాహ పరుస్తూ.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరంటే ఇష్టపడుతున్నాను" అన్నాడు గుసగుసలాడుతున్నట్టు.

అప్పుడు సరళ అతడిని నవ్వుతూ చూసి "అనుకున్నాను. అదే చెప్పారు" అన్నది.

రాజారావు సిగ్గుపడి "అంతేకాదు. మీరు ఒప్పుకుంటే కట్నం లేకుండా పెళ్లికూడా చేసు కుందామనుకుంటున్నాను" అని అన్నాడు.

సరళ అతనలా అన్నప్పుడు కొంచెం ఆశ్చర్యపడింది. పెళ్లి గురించి అంటాడని అనుకోలేదు.

"మీకు ఇష్టమేనా సరళా?" అనడిగాడు స్వరం మార్చి.

"కేవలం నా ఇష్టమే కాదు రాజారావు గారూ... మా అమ్మకు కూడా చెప్పాలి కదా!" అన్నది సరళ.

"అలాగే చెప్పండి" అన్నాడు రాజారావు.సరళ తల ఊపింది.

తర్వాత ఇద్దరూ అక్కడినించి కదిలారు.

వాళ్లిద్దరూ తిరిగి వస్తున్నప్పుడు వాళ్లకు ఓ కూల్‌డ్రింక్ షాపు దగ్గర నిలుచుని, వాళ్ల బేంక్ మేనేజర్‌తో కలిసి డ్రింక్ తాగుతున్న బేంక్ క్లర్క్ రాజేశ్వరి కనిపించింది. వాళ్లు సరళనీ, రాజారావునీ చూడలేదు.

వాళ్లని దాటి వచ్చినాక రాజారావు-సరళతో ఇలా అన్నాడు.

"ఇద్దరు పిల్లల తల్లయి కూడా మన రాజేశ్వరి ఇలా మేనేజర్‌తో విహారాలు చేస్తోంది. రాజేశ్వరి మొగుడికి ఈ విషయం తెలీదు కదా! తెలిస్తే బాధ పడతాడు. ఐనా రాజేశ్వరికి బుద్ధి లేదు"

సరళ మాట్లాడలేదు. విని ఊరుకుంది మవునంగా.

ఎగ్జిబిషన్ గ్రవుండ్‌లో నించి బయటకు వచ్చి, రోడ్డు ఎక్కిన తర్వాత "ఇక నేను వెళతాను, మన పెళ్లి గురించి మీ నిర్ణయాన్ని కొంచెం త్వరగా తెలియజేస్తారు కదూ!" అన్నాడు రాజారావు.

"ఇందుగురించి మీరు ఎదురు చూడవలసిన అవసరంలేదు రాజారావు గారూ... నా నిర్ణయాన్ని ఇప్పుడే తెలియజేస్తాను. మిమ్మల్ని పెళ్లిచేసుకోవడం నాకు ఇష్టం లేదు" అన్నది.

రాజారావు షాక్ ఫీలయి "ఎందుకు?" అనడిగాడు హీనస్వరంతో.

"ఎందుకంటే, మీది చాలా సంకుచితి మనస్తత్వం అని ఇప్పుడే అర్థమయింది. ఎలాగంటే? మనం కలుసుకున్నట్టే ఈ ఎగ్జిబిషన్‌లో రాజేశ్వరి, మేనేజర్ కలుసుకుని వుంటారు. ఒకే ఆఫీస్‌లో ఉద్యోగం చేసే ఇద్దరు ఉద్యోగులు కొంచెం చనువుగా మాట్లాడుకోవడం, నవ్వుకోవడం చాలా సహజం. అలాంటి సహజమైన విషయాన్ని మీరు ఎంతో అసహజంగా చిత్రించారు. వాళ్లిద్దరి మధ్య ఏదో సంబంధం ఉన్నట్టూ, రాజేశ్వరి భర్తని మోసం చేస్తున్నట్టు మాట్లాడారు. మీ మాటల్లోనే మీ వక్రదృష్టి తెలుస్తోంది. మీ సంస్కారం బయటపడుతోంది. మీలాంటి మనిషిని నేను కోరుకోను. కోరుకోలేను. సారీ...ఇంతటితో ఈ విషయాన్ని మరచిపోండి" అని అక్కడినించి విసురుగా వెళ్లిపోయింది సరళ.

నిశ్చలంగా రోడ్డుమీద నిలబడిపోయాడు రాజారావు. అతడిలో ఆలోచనలు జయింట్‌వీల్‌లా గిర్రున తిరుగుతున్నాయి.

(2-9-1983 ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితం)